
సాక్షి ఒడిశా
శుక్రవారం । 31 । జనవరి । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,64,604లు, బంగారం 150 మిల్లీగ్రాములు, వచ్చాయని అధికారులు తెలిపారు.



బీఎస్ఎఫ్ ప్రజా శిబిరం

తులసీ పహాడ్‌లో బీఎస్ఎఫ్ ప్రజా శిబిరం నిర్వహించారు. గిరిజనులు భారీగా వచ్చారు.

- 8లో



ఉల్లాసంగా.. ఉత్సాహంగా

జయపురం హైస్కూల్ వార్షికోత్సవం ఘనంగా జరుగుతోంది. ప్రదర్శనలన్నీ ఆకట్టుకుంటున్నాయి.

- 8లో

న్యూస్‌రీల్

శ్రమదానంతో రోడ్డు నిర్మాణం



శ్రమదానం చేసి కొండపైకి రోడ్డు వేస్తున్న యువకులు

పర్లాకిమిడి: స్థానిక బోయవీధి కొండ మీద శ్రీవీరాంజనేయ స్వామి మందిరానికి చేరుకోవడానికి కొందరు ఆంజనేయ భక్తులు, యువకులు శ్రమదానం చేశారు. ఈ శ్రమదానంలో వీరాంజనేయ కమిటీ సభ్యులు, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో అగ్ని మాపక వ్యవస్థపై ఆరా

భువనేశ్వర్: రాష్ట్ర వ్యాప్తంగా ఆస్పత్రుల్లో అగ్నిమాపక వ్యవస్థపై రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం దృష్టి సారించింది. ఈ మేరకు అందుబాటులో ఉన్న అగ్నిమాపక భద్రత వ్యవస్థ ఆడిట్ నివేదికలను దాఖలు చేయాలని ఉన్నత న్యాయ స్థానం ఆదేశించింది. ఈ ప్రక్రియ కోసం 4 నెలలు గడువు కల్పించింది. ఈ వ్యవధిలోగా ఆడిట్ నివేదిక దాఖలు చేయాలని రాష్ట్ర అగ్ని మాపక సేవలు, హోం గార్డ్స్, సివిల్ డిఫెన్స్ డైరెక్టర్ జనరల్‌కు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కేంద్రాపడాలోని ఓ ఆస్పత్రిలో అగ్ని మాపక వ్యవస్థకు సంబంధించి దాఖలైన వ్యాజ్యం విచారణ సందర్భంగా జస్టిస్ ఎస్‌కే పాణిగ్రాహి ఏక సభ్య ధర్మాసనం ఈ ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలోని ఆస్పత్రుల్లో అగ్ని మాపక వ్యవస్థ స్థితిగతులకు సంబంధించి సవివరమైన అఫిడవిట్‌ను దాఖలు చేయాలని అనుబంధ వర్గాల ఉన్నతాధికారులకు ఉన్నత న్యాయ స్థానం ఆదేశించింది. ఆదేశాల జారీ నుంచి 4 నెలల వ్యవధిలో సవివరంగా అఫిడవిట్ దాఖలు చేయాలని ధర్మాసనం పేర్కొంది.

అడ్వైజరీ కమిటీలో జయపురం వాసులు



అడ్వైజరీ కమిటీ సభ్యులతో ఎంపీ ఉల్కా

జయపురం: జయపురం ఎయిర్ పోర్టు అడ్వైజరీ కమిటీ సభ్యులుగా జయపురం పట్టణానికి చెందిన ఐదుగురు వ్యక్తులను నామినేట్ చేశారు. జయపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు వి.ప్రభాకర్, హలో జయపూర్, సినీప్లెక్స్ యజమాని ఆలోక్ అగర్వాలా, ట్రావెల్ ఏజన్సీ యజమాని బాలకృష్ణ పాడీ, ప్రముఖ కళాకారుడు దిరెన్ మోహన్ పట్నాయక్, సమాజ సేవకుడు దుర్గాశంకర సాహును నామినేట్ చేసినట్లు కోరాపుట్ ఎంపీ, రూరల్ డవలప్‌మెంట్ , పంచాయతీ రాజ్ చైర్మన్ సప్తగిరి శంకర ఉల్కా తెలిపారు.

మహాత్మునికి .. ఘనంగా నివాళులు

భువనేశ్వర్: అమరవీరుల దినం సందర్భంగా జాతిపిత మహాత్మా గాంధీకి ప్రముఖులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శాసన సభ ఆవరణలో బాపూజీ విగ్రహానికి పూలమాలలతో అలంకరించి ప్రత్యేక నివాళి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి, శాసనసభ స్పీకర్ సురమా పాఢి, ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝితో పాటు ఉప ముఖ్యమంత్రులు కనక వర్ధన్ సింగ్‌దేవ్, ప్రభాతి పరిడా, రాష్ట్ర మంత్రివర్గ సభ్యులు హాజరయ్యారు. వీరంతా బాపూజీ విగ్రహం దగ్గర పుష్పాంజలి ఘటించారు.

పర్లాకిమిడిలో..

పర్లాకిమిడి: మహాత్మాగాంధీ సంస్మరణ దినోత్సవం పురస్కరించుకుని స్థానిక కలెక్టరేట్‌లో అధికారులు, సిబ్బంది ఐదు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా మేజిస్ట్రేట్ రాజేంద్ర మింజ్, డిప్యూటీ కలెక్టర్ కమలకాంత పండా, డిప్యూటీ కలెక్టర్లు లిపినాదాస్, కశ్యప్ బెహరా, మనోజ్ కుమార్ పట్నాయిక్, మినిస్టీరియల్ సిబ్బంది ఉన్నారు.

రాయగడలో..

రాయగడ: సహీద్ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో గురువారం అమర వీరులకు నివాళులు అర్పించారు. కలెక్టర్ ఫరూల్ పట్వారి, ఏడీఎం నిహారి రంజన్ కుహారా, సబ్ కలెక్టర్ కల్యాణి సంఘమిత్రాదేవి, ఉద్యోగులు సిబ్బంది మహాత్ముని చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

మల్కన్‌గిరిలో..

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని డైలీ మార్కెట్ ఆవరణలో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహం వద్ద గురువారం జిల్లా కాంగ్రెస్ ప్రెసిడెంట్ గోవింద పాత్రో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ సభ్యులు జి.శ్రీనివాస రావు, పి.కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని గాంధీ జంక్షన్‌లో గాంధీ విగ్రహానికి డీసీసీ మాజీ అధ్యక్షుడు మున్నా త్రిపాఠి, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు సిరాజ్ అహ్మద్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా కేంద్రంలో కలెక్టర్ వి.కీర్తి వాసన్ గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో ప్రభుత్వ కార్యాలయాలు, గాంధీ విగ్రహాల వద్ద సంతాప సభలు జరిగాయి.



పర్లాకిమిడి: కలెక్టరేట్‌లో మహాత్మాగాంధీ సంస్మరణ దినోత్సవంలో అధికారులు, సిబ్బంది



భువనేశ్వర్: బాపూజీకి పుష్పాంజలి ఘటించిన రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి



భువనేశ్వర్: బాపూజీకి పుష్పాంజలి ఘటించిన రాష్ట్ర గవర్నర్ డాక్టరు హరి బాబు కంభంపాటి



పర్లాకిమిడి: గజపతి కలెక్టరేట్‌లో మహాత్మాగాంధీ సంస్మరణ దినోత్సవంలో అధికారులు, సిబ్బంది



మల్కన్‌గిరి: మార్కెట్ వద్ద గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కాంగ్రెస్ నేతలు



భువనేశ్వర్: అమర వీరుల నివాళి సభకు హాజరైన ప్రముఖులు



భువనేశ్వర్: పోలీసు లాంచనాలతో జాతిపితకు శ్రద్ధాంజలి



రాయగడ: మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటిస్తున్న కలెక్టర్ పట్వారి



కొరాపుట్: నబరంగ్‌పూర్‌లో గాంధీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న మున్నా త్రిపాఠీ, సిరాజ్ అహ్మద్

అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

రాయగడ: సదరు సమితి తడమ పంచాయతీలో అటవీ శాఖ ఆధ్వర్యంలో అడవుల సంరక్షణపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ పరిధి గోపాల్‌పూర్ నుంచి తడమ గ్రామం వరకు ర్యాలీ కొనసాగింది. అటవీ శాఖ రేంజర్ కామేశ్వర్ ఆచాచి, తడమ పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహా కుంభమేళా ప్రత్యేక బస్సు సేవలు తాత్కాలికంగా నిలిపివేత

భువనేశ్వర్: ఒడిశా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఓఎస్ఆర్టీసీ) మహా కుంభ మేళాకు ప్రత్యేక బస్సు సేవలు ప్రవేశ పెట్టింది. తొలి దశలో ఈ నెల 12 నుంచి ప్రయాగ్‌రాజ్‌కు 8 ప్రత్యేక బస్సులను ప్రవేశ పెట్టారు. ఫిబ్రవరి నెల 26 వరకు ఈ సేవలు కొనసాగుతాయని ప్రకటించారు. మహా కుంభ మేళాలో ఇటీవల చోటు చేసుకున్న అనూహ్య పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఈ సేవల్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఓఎస్ఆర్టీసీ గురువారం ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 4 వరకు మ హా కుంభ మేళా ప్రత్యేక బస్సు సేవలు రద్దు చేసినట్లు తెలిపారు. ఈ వ్యవధిలో మహా కుంభ మేళాకు ప్రయాణాన్ని ఇప్పటికే బుక్ చేసుకున్న ప్రయాణికులకు ఓఎస్ఆర్టీసీ అవసరమైన చోట అనుకూల సహాయం అందజేసేందుకు ఏర్పాట్లు చేసింది. సేవల రద్దు నేపథ్యంలో టికెట్ చార్జీ ఫిరాయింపులకు ఓఎస్ఆర్టీసీ హామీ ఇచ్చింది. సంప్రదింపుల కోసం మొబైల్ నంబర్ 9937547773 ను ఏర్పాటు చేశారు.

జీరో వేస్ట్‌పై అవగాహన



జీరో వేస్ట్ స్కూల్ కార్యక్రమం ప్రారంభించిన నగర మేయరు సులోచన దాస్

భువనేశ్వర్: పాఠశాలల పరిసరాల్లో పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు స్థానిక నగర పాలక సంస్థ బీఎంసీ జీరో వేస్ట్ స్కూల్ కార్యక్రమం ప్రారంభించింది. దీనిలో భాగంగా నిరంతర వ్యర్థ పదార్థాల నిర్వహణ పద్ధతుల్ని విద్యార్థులకు నేర్పిస్తారు. భావి తరాలకు వ్యర్థంతో పరిసరాల కాలుష్యం నివారించడంపై అవగాహనకు బీజం నాటడం లక్ష్యమని నగర మేయరు సులోచన దాస్ తెలిపారు. ఆమె ముఖ్య అతిథిగా హాజరై స్థానిక సాహిద్ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జీరో వేస్ట్ స్కూల్ కార్యక్రమం ప్రారంభించారు. ప్రయోగాత్మకంగా ఇక్కడ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. తదుపరి దశల్లో నగర వ్యాప్తంగా పాఠశాలల్లో ఈ కార్యక్రమం ప్రవేశ పెట్టనున్నట్లు ప్రకటించారు. తొలి విడత కింద నగరంలో 10 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ సులోచన దాస్‌తో సలహా మండలి అధ్యక్షుడు, 30వ నంబరు వార్డు కార్పొరేటర్, జిల్లా పరిషత్ సూపరింటెండెంటు ఇంజినీరు, బీఎంసీ సహాయ కమిషనర్ (పారిశుద్ధ్యం), మహారాష్ట్ర ఆసరా ఫౌండేషన్ నిపుణులు పాల్గొన్నారు.



వ్యర్థ పదార్థాల నిర్వహణపై విద్యార్థుల అవగాహన తెలుసుకున్న మేయరు

జలమే గరళమై..

- దయా నది నీరు కలుషితం
- ఇప్పటికే నలుగురు మరణం
- మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు

భువనేశ్వర్: దయా నది నీరు కలుషితమైంది. నిత్యావసరాలకు ఈ నీటిని వినియోగించిన వారిలో నలుగురు మృతి చెందారు. మరికొంత మంది అనారోగ్యంతో ఆస్పత్రిలో పడి ఉన్నారు. అయినా ప్రభుత్వ అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. సురక్షిత తాగునీరు పూర్తిస్థాయిలో సరఫరా చేయలేని దుస్థితిలో యంత్రాంగం ఉంది. నదీ నీటి కాలుష్యం నివారణ దిశలో చర్యలేవీ తీసుకోవడం లేదు. ఈ దయనీయ పరిస్థితులపై జలాశయాల సంరక్షణ వర్గాలు తీవ్రంగా స్పందించాయి. తక్షణ చర్యల కోసం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, పోలీసులకు ఈ వర్గాలు సంప్రదించాయి. దయా నది నీటి కాలుష్యానికి స్థానిక నగర పాలక సంస్థ బీఎంసీ కమిషనర్, తూర్పు కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ నిర్లక్ష్యం కారణమని మహానది బొంచావ్ ఆందోళన్, దయా సురక్షా అభిజాన్ వర్గాలు ఆరోపించాయి. ఈ మేరకు ఈ ఇరువురు అధికారుల వ్యతిరేకంగా స్థానిక ఖారవేళ నగర్ పోలీస్ ఠాణాలో ఫిర్యాదు దాఖలు చేశారు. మురికి నీరు నిర్వహణ లోపంతో నగరం నుంచి కలుషిత నీరు గంగువా కాలువ గుండా దయా నదిలో కలియడంతో నీరు విషపూరితమైంది. ఈ నదీ జలాలపై పూరీ జిల్లా కొణాస్ మండలం ప్రజలు ఆధారపడి జీవిస్తున్నారు. దీంతో ఈ మండలంలో నలుగురు మృతి చెందడంతో వందలాది మంది వివిధ ఆస్పత్రుల్లో చేరి చికిత్స పొందుతున్నారు. స్థానిక సత్యనగర్ సమీపంలోని రైల్వే శాఖకు చెందిన రైల్వే వాషింగ్ పాయింట్ వద్ద రైల్వేలోని వ్యర్థాలు, బయో టాయిలెట్ మలమూత్రాలు తదితర విషపూరిత వ్యర్థాలు నేరుగా గంగువా కాలువకు విడుదల చేస్తున్నారు. దయా నదిలో నీరు కాలుష్యానికి ఇది ప్రధాన కారణం. భువనేశ్వర్ నగర పాలక సంస్థ బీఎంసీ నగర వ్యాప్తంగా ప్రజలు వినియోగించిన నీటిని అన్ని మురికి కాలువల నీటి ప్రవాహాన్ని గంగువా కాలువతో అనుసంధానపరిచి మురికి నీటిని నిర్వహిస్తున్నారు.

సంస్థల ప్రతినిధి బృందం స్థానిక సత్యనగర్‌లోని రైల్వే వాషింగ్ పాయింట్‌కు వెళ్లి వాస్తవ పరిస్థితిని అధ్యయనం చేసింది. రైల్వే వాషింగ్ యార్డులో నీరు వెళ్లేందుకు రెండు మార్గాలున్నాయి. ఆ కాలువలోని వ్యర్థ జలాలను శుద్ధి చేసేందుకు చిన్న ప్లాంట్‌ను నిర్మించారు. ఇదో కంటి తుడుపు చర్యగా ప్రతినిధి బృందం పేర్కొంది. దీర్ఘ కాలంగా ఈ వ్యవస్థ పని చేయకుండా మొరాయిస్తోంది. నామ మాత్రంగా దర్శనం ఇస్తుంది. ఈ పరిసరాల్లో కలుషిత వాతావరణం అలముకుని ఉంది. పురుగులతో కూడిన మురికి నీటిని పెద్ద పైపుల ద్వారా నేరుగా గంగువా కాలువకు విడుదల చేస్తున్నారు. ఈ నిర్లక్ష్యపు చర్యలతో దయా నది నీటిని కలుషిత పరిచింది. వినియోగదారులపై విషంగా పరిణమించి ప్రాణాల్ని బలిగొంది. ఈ ఆరోపణలతో బీఎంసీ కమిషనర్, తూర్పు కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ వ్యతిరేకంగా స్థానిక ఖారవేళ నగర్ ఠాణాలో పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.



గంగువా కాలువ దుస్థితి

సురక్షిత తాగునీరు కొరత

అతిసార ప్రభావిత గ్రామాల్లో నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు. దీనిపై దృష్టి సారించాలని కోరారు. అతిసార ప్రభావిత గ్రామాలైన కొణాస్ మండలంలో 38 ట్యాంకుల ద్వారా ప్రభుత్వ యంత్రాంగం సురక్షిత తాగు నీరు సరఫరా చేస్తోంది. నువాగాంవ్, జగులాయిపాద వరకు తగినంత నీరు అందుతుంది. గొడిశగొదా, గోపీనాథ్ పూర్, జమొలొగొదా గ్రామాలకు సరిపడా నీరు చేరడం లేదు. మరోవైపు 4 నీటి ట్యాంకులు అక్కరకు రాకుండా మొరాయిస్తున్నాయి. వెంటనే మరమ్మతు చేయడానికి గ్రామీణ తాగు నీటి సరఫరా శాఖ చీఫ్ ఇంజినీర్ ఆదేశించారు. భువనేశ్వర్ నగర పాలక సంస్థ బీఎంసీ దయా నది, గంగువా కాలువ శుభ్రం చేసేందుకు జల వనరుల శాఖ నుంచి అనుమతి కోరింది. జల వనరుల శాఖ ఇప్పటి వరకు అనుమతులు ఇవ్వకపోవడంతో బీఎంసీ దయా నది పడమట కాలువను ప్రయోగాత్మకంగా వంద మీటర్ల మేర పూర్తి చేయాలని యోచిస్తోంది.

కొణాస్ మండలం అతిసార హాట్ స్పాట్

దయా నది నీటి కాలుష్యంతో పూరీ జిల్లా కొణాస్ మండలం అతిసార హాట్‌స్పాట్‌గా మారింది. ఈ మండల వ్యాప్తంగా అతిసార శర వేగంగా విస్తరిస్తోంది. నిత్యం పీడితుల సంఖ్య పెరుగుతోంది. ఇప్పటి వరకు నలుగురి ప్రాణాలు పొట్టన బెట్టుకుంది. ప్రభుత్వం మాత్రం ఒక మరణాన్ని ధ్రువీకరించింది. దీని పట్ల ప్రజలలో అసంతృప్తి కట్టలు తెంచుకుంది. న్యాయం కోసం ప్రభావిత వర్గం మానవ హక్కుల కమిషన్‌కు గోడు వినిపించేందుకు నడుం బిగించింది. దయా నది కలుషిత నీటిని ఉపయోగించడం వల్ల కొణాస్ మండలంలో అతిసార వ్యాపించింది. ఈ ప్రాణాంతక పరిస్థితి పట్ల మహానది బొంచావ్ ఉద్యమ వర్గం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ దృష్టికి తీసుకుని వెళ్లింది. కలుషిత నీరు తాగి మృతి చెందిన 4 మంది కుటుంబాలకు రూ. 15 లక్షలు చొప్పున పరిహారం చెల్లించేందుకు ఆదేశించాలని విజ్ఞప్తి చేసింది. భువనేశ్వర్ నగర వ్యాప్తంగా వినియోగ విషపూరితమైన నీరు గంగువా కాలువ ద్వారా దయా నదిలో అన్ని వ్యర్థాలతో కలిసిపోతుంది. ఈ చర్యకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కమిషన్‌కు లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేశారు.

2 నుంచి వేంకటేశుని ఆలయ వార్షికోత్సవం

జయపురం: జయపురం ఎస్‌కేటీ రోడ్డులో గల వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయ 20వ వార్షికోత్సాలు ఫిబ్రవరి 2న ప్రారంభమవుతాయని ఆలయ కార్యనిర్వాహక కమిటీ గురువారం తెలిపింది. వార్షికోత్సవాలు 4 రోజులు జరుగుతాయని తెలిపారు. రెండో తేదీ ఉదయం 8 గంటలకు అభిషేకంతో ప్రారంభమయ్యే ఉత్సవాల్లో స్వామికి అష్టోత్తర శత కలశ స్నపనం జరుగుతుందని, సాయంత్రం 5 గంటలకు శ్రీవిశ్వక్సేన పూజ, మంగళ శాసనం కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. 3వ తేదీ 9 గంటలకు ధ్వజారోహణం జరుగుతుందని ఈ కార్యక్రమంలో సంతానం లేనివారికి గరుడ ప్రసాదం ఇస్తారని తెలిపారు. సాయంత్రం 5 గంటలకు శ్రీవారి కల్యాణ మహోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు. 4 వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు సామూహిక లక్ష్మీ కుంకుమార్చన, లక్ష్మీ హోమం నిర్వహిస్తామన్నారు.



జయపురం వైభవ వేంకటేశ్వర స్వామి

క్లుప్తంగా

జిల్లా సంక్షేమ శాఖ అధికారిపై చర్యలు



జిల్లా సంక్షేమ శాఖ అధికారి అసీమారావు

రాయగడ: విధుల్లో నిర్లక్ష్యం, అత్యవసర సమావేశాలకు హాజరవ్వకపోవడం, కార్యాలయంలో కార్యకలాపాలు నిలిచిపోవడం వంటి పనుల్లో అసంతృప్తి వ్యక్తం చేసిన జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారీ జిల్లా సంక్షేమ శాఖ అధికారి అసీమ్ రావ్‌పై చర్యలు తీసుకున్నారు. ఆమెను భువనేశ్వర్‌లోని ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశిస్తూ విధుల నుంచి గురువారం రిలీవ్ చేశారు. అదేవిధంగా అదనపు జిల్లా సంక్షేమ శాఖ అధికారిగా ఉన్న మలయ రంజన్ చినారకు తక్షణమే అదనపు బాధ్యతలు అప్పగించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గత కొద్దినెలలుగా జిల్లా సంక్షేమ శాఖ అధికారి రావ్ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలపై స్పందించిన కలెక్టర్ పట్వారి ఇదివరకు నాలుగు సార్లు ఆమెకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అయితే అందుకు సంక్షేమ శాఖ అధికారి స్పందించకపోవడంతో చర్యలు తీసుకున్నారు.

మాజీ ఎంపీ జిన్ను హిక్కాకి పితృ వియోగం



కొరాపుట్: మాజీ పార్లమెంట్ సభ్యుడు జిన్ను హిక్క తండ్రి నందు హిక్క (80) తుది శ్వాస విడిచారు. గురువారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. జిన్ను స్వగ్రామం కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ సమితి తోయాపుట్ గ్రామ పంచాయతీ దుమ్రి పాదర్‌లో అంత్యక్రియలు జరిగాయి. అవిభక్త కొరాపుట్ జిల్లాలకు చెందిన బీజేడీ మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు పెద్ద ఎత్తున అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి



బీఈడీ విద్యార్థులతో అతిథులు, ఉపాధ్యాయులు

జయపురం: విద్యార్థులే దేశ భవిష్యత్ అని, వారిని ఉత్తమ పౌరులుగా దీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని స్థానిక విక్రమదేవ్ విశ్వవిద్యాలయ టీచర్స్ శిక్షణ విభాగం) చీఫ్ డాక్టర్ మనోరంజన్ ప్రదాన్ అన్నారు. బుధవారం విక్రమదేవ్ విశ్వవిద్యాలయ టీచర్స్ ట్రైనీ విద్యార్థులు పాఠశాలకు వచ్చి వారు స్పాన్సర్ చేసిన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందించారు. డాక్టర్ మణోరంజన్ ప్రదాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


వాలీబాల్ విజేతగా సనపొరియ



బహుమతుల ప్రదాన వేదికపై డాక్టర్, సర్పంచ్‌లు, తదితరులు

జయపురం: జయపురం సబ్ డివిజన్ బొరిగుమ్మ సమితి డెంగాపొదర్ గ్రామంలో నిర్వహించిన పంచాయతీ స్థాయి వాలీబాల్ పోటీల్లో సనపొరియ పంచాయతీ (మా ఠకురాణీ టీమ్) విజేతగా నిలిచింది. డెంగాపొదర్ ప్రైమరీ వైద్య కేంద్రం వారు కుష్టి వ్యాధి నివారణ దినం సందర్భంగా నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో ఫైనల్‌కు చేరిన సనపొరియ పంచాయతీ, డెంగాపొదర్ పంచాయతీలు గురువారం తలపడ్డాయి. హాస్పిటల్ వైద్యాధికారి డాక్టర్ సురేష్ ఝంకార్, తదితరులు బహుమతులు అందజేశారు. హాస్పిటల్ సిబ్బంది ఫార్మాసిస్ట్ కేశవ ఆచారి, హెల్త్ వర్కర్‌లు రీణా బెహర, శ్రీనివాస్, లెబొరేటరీ టెక్నీషియన్ దీపాలి, ఉపాధ్యాయులు, డెంగాపొదర్ పంచాయతీ సర్పంచ్ ప్రభాయితీ పాయిక్, సనపొరియ సర్పంచ్ సుకుమన్ భొత్ర, వాటీబాల్ టోర్నమెంట్ నిర్వహణ కమిటీ యువకులు, సీనియర్ సిటిజన్ పూర్ణ చంద్రమఝి, రతన్ రొందారి పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనే ధ్యేయం



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో బాలమురళీకృష్ణ తదితరులు

అరసవల్లి: జిల్లాలో కుష్టు వ్యాధి నివారణే ధ్యేయంగా వైద్యశాఖ సిబ్బంది పనిచేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ బాలమురళీకృష్ణ అన్నారు. మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం కుష్టు వ్యతిరేక దినం నిర్వహించారు. కుష్టు వ్యాధి నివారణకు పిలుపునిస్తూ ర్యాలీ చేపట్టారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో వ్యాధిపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డీఎల్‌వో డాక్టర్ శ్రీకాంత్, డీపీఎంవో వాన సురేష్, డీఎస్ఎంవో ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

తులసీ పహాడ్‌లో బీఎస్ఎఫ్ ప్రజా శిబిరం

మల్కన్‌గిరి:

మల్కన్‌గిరి జిల్లా మత్తిలి సమితి తులసీ పహాడ్‌లో గురువారం బీఎస్ఎఫ్ 2వ బెటాలియన్ తరఫున ఓ ప్రజా సంబంధ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని బీఎస్ఎఫ్ డీఐజీ విజయ్ సింగ్ ప్రారంభించారు. వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరానికి తులసీ పహాడ్, చెరకోట్ల, కిరిమిట, లాకిటిగూఢ, డండిపధర్, కోతాపధర్ గ్రామాలకు చెందిన 470 మంది గిరిజనులు హాజరై బీఎస్ఎఫ్ అధికారులు అందజేసిన సామాన్లు తీసుకున్నారు. కార్యక్రమంలో 2వ బెటాలియన్ కమాండర్ వి.పి.సింగ్, బెటాలియన్ వైద్యుడు అమిత్ కుమార్, టీమురుపల్లి సర్పంచ్ తమేశ్వర్ సమర్ద్, మత్తిలి ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ప్రమోద్ కుమార్ సాహు, డాక్టర్ సాలిని సాహు బీఎస్ఎఫ్ జవాన్లు పాల్గొన్నారు. సర్పంచ్ తామేశ్వర్ మాట్లాడుతూ గిరిజనుల్లో చైతన్యం కల్పించడం కోసం బీఎస్ఎఫ్ అధికారుల సహకారం ఎంతో అవసరమన్నారు.



శిబిరాన్ని ప్రారంభిస్తున్న బీఎస్ఎఫ్ డీఐజీ విజయ్ సింగ్



శిబిరం వద్ద వైద్యులు ఇతర బీఎస్ఎఫ్ అధికార్లు



గిరిజనులకు సైకిళ్లు అందజేస్తున్న డీఐజీ విజయ్ సింగ్



చార్జింగ్ లైట్ అందుకుంటున్న గిరిజనుడు



చిన్నారులకు స్కూల్ బ్యాగులు ఇస్తున్న బీఎస్ఎఫ్ డీఐజీ విజయ్ సింగ్


మావోయిస్టు అగ్రనేత అరుణపై రివార్డు

- రూ.65 లక్షల రివార్డు ప్రకటించిన నాలుగు రాష్ట్రాల పోలీసులు

మల్కన్‌గిరి: ఇటీవల ఒడిశా – ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో గరియబంద్ వద్ద జరిగిన ఎన్ కౌంటర్‌లో మృతి చెందిన ఒడిశా మావోయిస్టు చీఫ్ సెక్రటరీ చలపతి భార్య అరుణను సజీవంగా పట్టుకునేందుకు నాలుగు రాష్ట్రాల పోలీసులు అడవిని జల్లెడ పడుతున్నారు. ఈ మేరకు ఆమెపై రూ.65 లక్షల రివార్డు ప్రకటించారు. గరియబంద్ ఎన్ కౌంటర్‌లో ఆమె తప్పించుకున్నారు. భర్త చలపతి అంత్యక్రియలకు శ్రీకాకుళం జిల్లా పలాస మండలం బొడ్డపాడు ఆమె వస్తుందని పోలీసులు భావించినా రాలేదు. అయితే భర్త చలపతి మరణం తర్వాత ఆమె పోలీసులకు లొంగిపోతారా.. దళంలోనే బాధ్యతలు నిర్వహిస్తారా అనేది చర్చనీయాంశమైంది.

ఒడిశాలో కార్యకలాపాలు

అరుణ ప్రధానంగా ఒడిశాలోని కొరాపుట్, కలహండి, బౌధ్, నయగడ్ జిల్లాల్లోని అడవుల్లో కార్యకలాపాలు సాగించింది. అయితే ఆమె కొంతకాలంగా భర్తతోనే ఉంటోంది. పలు ఎదురు కాల్పుల్లో ఇద్దరూ తప్పించుకున్నారు. గరియబంద్ ఎన్ కౌంటర్‌లో ఆమె కూడా మృతి చెందిదని అనుకున్నారు. కానీ ప్రాణాలతో బయటపడిందని పోలీసు అధికారులు నిర్ధారించారు. అయితే ప్రస్తుతం స్వల్ప గాయాలతో మహారాష్ట్ర గడ్చిరోలీ ప్రాంతంలో సురక్షితంగా ఉన్నట్లు నిఘావర్గాల సమచారం. ప్రస్తుతం ఆమె వయసు 55 ఏళ్లు ఉంటాయని భావిస్తున్నారు.



దళంలో భర్త చలపతితో సెల్ఫీ దిగిన అరుణ (ఫైల్)

అరుణ నేరాల చిట్టా

మావో హింసత్మాక ఘటనల్లో అరుణ కీలక పాత్ర పోషించారు. 2004లో భర్త చలపతితో పాటు కొరాపుట్ పోలీసుస్టేషన్‌పై దాడి, 2008లో చిత్రకొండ జలాశయంలో ఆంధ్రా గ్రేహౌంట్స్‌పై కాల్పులు, 2012లో కొరాపూట్ జిల్లా లక్ష్మీపూర్ ఎమ్మెల్యే జిన హికాకా అపహరణ, 2005లో దమంజోడి నాల్కో కాంపెనీపై దాడి, 2018లో అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరావు హత్య, 2013లో మహేంద్ర కర్మపై దాడి ఇలా పలు ఎదురుకాల్పుల్లో ఆమె కీలక ప్రాత్ర పోషించారు.

రోడ్డు విస్తరణకు చర్యలు



సర్వే అధికారులకు ల్యాండ్ సర్టిఫికెట్లు చూపిస్తున్న బస్తీ వాసులు

జయపురం: స్థానిక క్రిస్టియన్‌పేట నుంచి పంచానన మందిరం వరకు గల బైపాస్ రోడ్డును 60 అడుగుల వెడల్పుగా మార్చేందుకు మున్సిపాలిటీ సర్వే ప్రారంభించింది. జగన్నాథ సాగర్ గట్టు చుట్టూ గల బైపాస్ రోడ్డులో ఆక్రమణలు తొలగించేదుకు బుధవారం సాయంత్రం మున్సిపాలిటీ, రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారు. జగన్నాథ్ సాగర్ గట్టు ప్రాంతం, చందనబెడ పాఠశాల ప్రాంతంలో కొత్త వీధి, కబరస్థాన్ ప్రహరీ పక్కన స్థలంలో ఉన్న బస్తీల్లో సర్వే నిర్వహించారు. మొత్తం 74 ఇళ్లు ఉన్నట్లు సర్వేలో వెల్లడైంది. ఈ రిపోర్టు జయపురం సబ్ కలెక్టరకు సమర్పిస్తామని అధికారులు తెలిపారు. సబ్ కలెక్టర్ ఆదేశాల ప్రకారం తరువాత చర్యలు చేపట్టనున్నట్లు తెలిసింది. ఆయా బస్తీల్లో ఉన్నవారు గతంలో ల్యాండ్ ఎలిజబుల్ సర్టిఫికెట్లు పొంది ఉన్నట్లు వాటిని అధికారులకు చూపించారు. ఈ సర్వేలో రెవెన్యూ సూపరింటెండెంట్ హరిహర శతపతి, దిలీప్ కుమార్ ప్రదాన్, పట్టణ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సూరజ్ కుమార్ పండా, తిరెన్ చలాన్, అసిస్టెంట్ ఆర్ఐ పద్మ ముదులి, మున్సిపాలిటీ అమీన్ శుభశ్మిత జెన, అభినాశ్ శాంత పాత్ర, సానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పాత్రో, తదితరులు పాల్గొన్నారు.

పట్టుబడిన బైక్ దొంగలు



స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు.

- 7 ద్విచక్రవాహనాలు స్వాధీనం
- నిందితుల్లో ఇద్దరు మైనర్లు

టెక్కలి రూరల్: టెక్కలి పరిసర ప్రాంతాల్లో రెండు నెలలుగా జరిగిన ద్విచక్ర వాహనాల చోరీలకు సంబంధించి టెక్కలి పోలీసులు ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు టెక్కలి సీఐ ఎ.విజయ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. గత రెండు నెలలుగా టెక్కలి పరిధిలోని పలు ద్విచక్ర వాహనాలు చోరీకి గురికావడంపై ఎస్పీ మహేశ్వరరెడ్డి, డీఎస్పీ మూర్తి ఆదేశాల మేరకు ఒక క్రైం టీమ్ ఏర్పాటు చేసి దర్యాప్తు చేసినట్లు సీఐ తెలిపారు. ఇందులో భాగంగా టెక్కలి అంబేడ్కర్ వీధికి చెందిన పడాల అఖిల్(19) అనే యువకుడిపై అనుమానం రావడంతో నిఘాపెట్టారు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం ముందస్తు సమాచారం మేరకు మెళియాపుట్టి రోడ్డులోని నాలుగురోడ్ల జంక్షన్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా ఐదుగురు వ్యక్తులు ఐదు ద్విచక్ర వాహనాలపై వస్తుండగా వారిని పట్టుకునే ప్రయత్నంలో ఇద్దరు వాహనాలను వదిలి పరారయ్యారు. మిగిలిన ముగ్గురిని అదుపులో తీసుకుని, వారి వద్ద నుంచి 5 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో ఇద్దరు మైనర్లు కాగా, మరొకరు టెక్కలికి చెందిన పడాల అఖిల్‌గా గుర్తించారు. ఆ యువకుడిని విచారించగా తాను ఒడిశా రాష్ట్రం రాయగడ ప్రాంతంలో బంధువులు ఇంటికి వెళ్లేవాడినని, అక్కడ కొంతమంది యువకులతో పరిచయం ఏర్పరుచుకుని వారితో కలసి ద్విచక్ర వాహనాలు చోరీ చేసేవాడినని చెప్పాడు. రాయగడకు చెందిన వారిని టెక్కలికి రప్పించి వారితో కలిసి ద్విచక్ర వాహనాలు చోరిచేసేవాళ్లమని, దానిలో భాగంగా డిసెంబర్ 26, 27 తేదీలలో టెక్కలిలో 2 ద్విచక్ర వాహనాలు, జనవరి 10, 11వ తేదీలలో మరో మూడు ద్విచక్ర వాహనాలు టెక్కలిలో చోరిచేసినట్లు అంగీకరించాడు. ఒడిశా రాష్ట్రం రాయగడ జిల్లా మునిగధ ప్రాంతంలో డిసెంబర్ 5న ఒక ద్విచక్రవాహనం, పార్వతీపురం మన్యం జిల్లాలో డిసెండర్ 30న ఒక ద్విచక్ర వాహనం చోరీ చేసినట్లు తెలిపారు. వారు చెప్పిన ఆధారాల ప్రకారం మొత్తం 7 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. తప్పించుకున్న మరో ఇద్దరిలో రాయగడకు చెందిన వ్యక్తి, కొరాపుట్టికి చెందిన మరో వ్యక్తిగా గుర్తించామని, వారిని కూడా త్వరలోనే పట్టుకుంటామని సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్ఐ కె.రాము, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ విజయ్‌కుమార్

పలాసలో మృతదేహం కలకలం

కాశీబుగ్గ: పలాస జాతీయ రహదారిని ఆనుకుని కోసంగిపురం చెరువు వద్ద గుర్తు తెలియని మృతదేహం కలకలం రేపింది. గురువారం అటుగా వెళుతున్న ఓ వ్యక్తి ఈ మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే క్లూస్ టీమ్‌తో ఘటనా స్థలానికి చేరుకున్న కాశీబుగ్గ పోలీసులు ఆధారాలు సేకరించి మృతదేహాన్ని పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెడలో రుద్రాక్షమాల ప్యాంటు, షర్ట్ ధరించి ఉన్న గుర్తు తెలియని యువకుడి వయసు సుమారు 30 ఏళ్లు ఉంటుందని భావిస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసుకున్న దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఇదే ప్రాంతంలో వారం కిందట కూడా మృతదేహం లభ్యమైంది. విద్యుత్ వైర్లు చుట్టేసి అనుమానాస్పదంగా మృతి చెందాడు. రైలు ట్రాక్‌పై వారం రోజుల వ్యవధిలో రెండు మృతదేహాలు లభ్యమయ్యాయి. కారణాలు ఏమైనా ఇటీవల కాలంలో అధికంగా మృతదేహాలు లభ్యంపై స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రూరల్ పోలీసులు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని పెదపాడు రోడ్డు సమీపంలో బుధవారం రాత్రి జరిగిన విద్యుత్ ప్రమాదంలో పాత్రునివలస గ్రామానికి చెందిన బరాటం యుగంధర్ (18) మృతిచెందాడు. స్థానికులు, రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఇటీవల పెదపాడు పరిధిలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రావాడ తాతారావుకు చెందిన ఓ షాపు అడ్డుగా ఉండటంతో దాన్ని వేరే ప్రాంతంలో మార్చేందుకు బుధవారం రాత్రి ప్రొక్లెయిన్‌తో పనులు చేపట్టారు. బడ్డీను తరలించే క్రమంలో హైటెన్షన్ వైర్లు తగలడంతో షార్ట్ సర్క్యూట్ జరగడంతో యుగంధర్ అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. ఈయనతో పాటు బరాటం ఉపేంద్ర, రావాడ జగదీష్‌కు తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రూరల్ ఎస్ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



పరుగు పోటీలో పాల్గొన్న విద్యార్థులు

జయపురం:

జయపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల 115వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. క్రీడలను జయపురం బ్లాక్ విద్యాధికారి చందన్ నాయక్ ప్రారంభించారు. పూర్ణఘడ్‌లో గల హనుమాన్ మందిరంలో పాఠశాల విద్యార్థులు పూజలు చేసి క్రీడా జ్యోతిని వెలిగించి పాఠశాల క్రీడా మైదానానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. హెచ్ఎం ప్రకాశచంద్ర పట్నాయక్ అతిథులను, క్రీడాకారులను ఆహ్వానించారు. ఈ పాఠశాల విద్యార్థులు జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచారన్నారు. 400 మీటర్లు, 600 మీటర్లు, 800 మీటర్లు పరుగు పోటీలు, షార్ట్ జంప్, హై జంప్, షార్ట్‌పుట్ త్రో, తదితర పోటీలు నిర్వహించారు. పోటీల నిర్వహణలో ఉపాధ్యాయులు సహకరించారు.



క్రీడా జ్యోతిని స్వీకరిస్తున్న అతిథి చందన్ నాయక్



హైజంప్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు

తాగునీటి ప్రాజెక్టు పనుల్లో నాణ్యత లోపం



నీరు చిమ్ముతున్న ట్యాంకర్



ఇంజినీర్‌ను నిలదీస్తున్న ఎమ్మెల్యే కద్రక

రాయగడ: పట్టణ ప్రజలకు తాగునీటి సౌకర్యార్థం నిర్మిస్తున్న మెగా తాగునీటి ప్రాజెక్టు పనుల్లో నాణ్యత లోపిస్తోందని రాయగడ ఎమ్మెల్యే అప్పల స్వామి కద్రక ఆరోపించారు. స్థానిక ఓఎంపీ ప్రాంతంలో ప్రాజెక్టు పనుల్లో భాగంగా కొత్తగా నిర్మించిన భారీ తాగునీటి ట్యాంకర్ నుంచి నీరు చిమ్ముతోందని, అదేవిధంగా ఇప్పటికే పగుళ్లు కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఆయన సంబంధిత శాఖ ఇంజినీర్ సహదేవ్ కిషాన్‌ను ట్యాంకర్ వద్దకు పిలిచి ఆయనపై మండిపడ్డారు. నిర్మాణం పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదని అవసరమైతే సంబంధిత శాఖ మంత్రి దృష్టికి ఈ విషయం తీసుకెళ్తానని హెచ్చరించారు. తక్షణమే తగు చర్యలు తీసుకుని పనుల్లో నాణ్యత పాటించాలని ఆదేశించారు.

గుమ్మాలో సంస్కృతి భవనం ప్రారంభం



గుమ్మలో సంస్కృతి భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి

పర్లాకిమిడి: జిల్లాలో గుమ్మాబ్లాక్‌లో మినీ స్టేడియంలో సంస్కృతి భవనాన్ని పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి గురువారం ప్రారంభించారు. గజపతి జిల్లా స్వతంత్ర అభివృద్ధి పరిషద్ నిధులతో ఈ సంస్కృతి భవనం నిర్మించినట్టు గుమ్మా బ్లాక్ అధ్యక్షురాలు సునేమీ మండళ్ తెలియజేశారు. ఈ సంస్కృతి భవనం వల్ల ఈ ప్రాంత గిరిజనులు, క్రిష్టియన్స్‌కు అనేక కార్యక్రమాలకు ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి అన్నారు. ఈ ప్రారంభోత్సవంలో ఉపహార్ సంస్థ డైరక్టర్ డా.రజత్ కుమార్ పాణి, అమృత్ ప్రీతం పాల్, సంతోష్ పరిచ్ఛా తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభించిన నూతన సంస్కృతి భవనం

క్లుప్తంగా

లబ్ధిదారులను ఎంపిక చేయాలి



మాట్లాడుతున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: జీవనోపాదులకు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. ఐటీడీఏలో వివిధ శాఖల అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఎటువంటి జీవనోపాధి పథకాలు పొందకుండా ఉన్న వారు అర్హులన్నారు. ప్రతీ సోమవారం పీజీఆర్ఎస్‌కు వచ్చే వినతులు పరిశీలించి వారిలో అర్హులుంటే గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ చిన్నబాబు, వెలుగు ఏపీడీ సన్యాసిరావు, డీపీఎం రమణ తదితరులు పాల్గొన్నారు.

బంగారం చోరీ



వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ సంతోషి

పార్వతీపురం టౌన్: మూడు తులాల బంగారం చోరీ జరిగిన సంఘటన పార్వతీపురం మండలం నర్సిపురం గ్రామంలో చోటు చేసుకుంది. పార్వతీపురం రూరల్ ఎస్ఐ సంతోషి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. షిర్డీసాయి నగర్‌కు చెందిన బి.రమాదేవి కుటుంబ సభ్యులతో కలసి ఈ నెల 28న శంబర పండగ నిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లారు. పండగ అయిన తర్వాత బుధవారం ఇంటికి చేరుకున్నారు. ఇంటికి వచ్చేసరికి వెనుక తలుపు తీసి ఉండడంతో అనుమానంతో బెడ్ రూమ్‌లో చూసేసరికి బీరువా తెరచి ఉంది. బీరువా నుంచి మూడు తులాల బంగారం చోరీ అయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పార్వతీపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం అక్రమ నిల్వలపై తనిఖీలు



పట్టణంలో రేషన్ దుకాణాలను ఆకస్మిక తనిఖీలు చేస్తున్న పౌర సరఫరాల శాఖ సిబ్బంది

విజయనగరం అర్బన్: రేషన్ బియ్యం అక్రమ నిల్వలపై పౌర సరఫరాల శాఖ అధికారులు గురువారం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అక్రమ నిల్వలు ఉన్నట్లు గుర్తించిన రెండు రేషన్ దుకాణాలపై 6ఏ కేసులను నమోదు చేసినట్లు పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారి మధుసూధనరావు తెలిపారు. అదే విధంగా పట్టణంలోని మరో రేషన్ దుకాణంపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



చాపాన రామారావు మృతదేహం

గజపతినగరం : మండల కేంద్రం రైల్వేస్టేషన్ సమీపంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం ఉదయం చోటు చేసుకుంది. బొబ్బిలి రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఈశ్వరరావు చెప్పిన వివరాల ప్రకారం మెంటాడ మండలం జయతి గ్రామానికి చెందిన చాపాన రామారావు (44) రాయగడ నుంచి గజపతినగరం వైపు రైలులో బుధవారం ప్రయాణం చేసి గజపతినగరం రైల్వేస్టేషన్‌లో దిగాడు. రాత్రంతా తన స్వగ్రామానికి వెళ్లకుండా గజపతినగరం రైల్వేస్టేషన్ పరిసరాల్లో ఉంటూ శుక్రవారం ఉదయం మృతి చెంది ఉన్నాడని తెలిపారు. ఆయనకు ఎటువంటి గాయాలు లేవని అనారోగ్యంతో మృతి చెందినట్లు సహజ మరణంగా గుర్తించినట్లు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య



వెంకటేష్ (ఫైల్)

పూసపాటిరేగ : మండల కేంద్రం భోగాపురం గంగరాజు చెరువులో ఓ వ్యక్తి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. భోగాపురానికి చెందిన పసుపులేటి వెంకటేష్ (21) కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అనారోగ్యం ఎంతకూ నయం కాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ నెల 23వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన వెంకటేష్ ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతికినా ఫలితం దక్కలేదు. గురువారం ఉదయం భోగాపురం గంగరాజు చెరువులో శవమై తేలాడు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం సుందరపేట ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు భోగాపురం ఎస్ఐ సూర్యకుమారి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మన్యంలో.. గజ ఘీంకారం..!

- నాగావళి, వంశధార, జంఝావతి నదీతీరాల వెంబడి గజరాజుల తిష్ట
- తరచూ పంటలు, ఆస్తులు, ప్రజల ప్రాణాలకు నష్టం
- 3,500 ఎకరాల్లో పంటలకు దినదిన గండం
- రూ.కోట్లలో నష్టాలు
- శాశ్వత పరిష్కారం కోరుతున్న మన్యం జిల్లా ప్రజలు
- ఎన్నికల ముందు గజరాజుల తరలింపునకు వాగ్దానం చేసిన కూటమి నేతలు



ఇటీవల భామిని మండలం ఘనసర వద్ద ఎమ్మెల్యే, అధికారుల ముందు బైఠాయించిన బాధిత రైతులు(ఫైల్)

పాలకొండ రూరల్/భామిని: మన్యం జిల్లాలో గజరాజుల ఘీంకారాలు నిత్యకృత్యమయ్యాయి. వీటి సంచారంతో ప్రజలు తమ ప్రాణాలు, పంటలు, ఆస్తులు కాపాడుకునేందుకు శ్రమిస్తున్నారు. అడవుల రూపు కోల్పోతుండడంతో ఏనుగుల మనుగడ కష్టమై జనావాసాల వైపు దూసుకు వస్తున్నాయి. ఆహారం కోసం పంట పొలాల వైపు వచ్చేస్తున్నాయి. దీంతో సాగు పొలాలను కాపాడుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా.. ఫలితం దక్కడం లేదు. మరోవైపు ఆస్తులు, ప్రాణాలు సైతం కోల్పోతున్నారు. ఎన్నికల ముందు ఏనుగుల తరలింపుపై కూటమి నేతలు స్పష్టమైన హామీలిచ్చి...నేడు వాటిని మరవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీటి పరీవాహక ప్రాంతాల వెంబడి గజరాజులు గుంపులుగా సంచరిస్తున్నాయి. వీటిని కట్టడి చేసే క్రమంలో అధికారిక యత్నాలు ఆశించిన ఫలితం ఇవ్వడం లేదు. దీంతో బాధిత గ్రామాల ప్రజలు తమకు పరిహారం వద్దు.. శాశ్వత పరిష్కారం కావాలని అటు ప్రజాప్రతినిధులను, ఇటు అధికారులను కోరుతున్నారు.

గ్రామాల్లో కునుకు కరువు

జిల్లాలో సువిశాలంగా విస్తరించి ఉన్న ఏజెన్సీ, నాగావళి, వంశధార, జంఝావతి నదీతీర పరివాహక ప్రాంతాల వెంబడి గజరాజుల గుంపులు తిష్ట వేసాయి. పాలకొండ నియోజకవర్గంలో భామిని, సీతంపేట పరిసరాల్లో నాలుగు ఏనుగులు సంచరిస్తూ పంటలు ధ్వంసం చేస్తున్నాయి. పార్వతీపురం రెవెన్యూ సబ్ డివిజన్ పరిధిలో కురుపాం, కొమరాడ, గరుగుబిల్లి, జియ్యమ్మవలస మండలాల్లో నిత్యం సంచరిస్తున్న ఏడు ఏనుగుల గుంపు అక్కడి ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. రైతులు సేద్యం చేస్తున్న అరటి, బొప్పాయి, మొక్కజొన్న, చెరకు, వరి, పామాయిల్, కర్బూజ, మామిడి, జీడి పంటలతో పాటు ఇతర ఆహార, వాణిజ్య పంటలను నాశనం చేస్తున్నాయి. జిల్లా పరిధిలో సుమారు 3,500 ఎకరాల మేర పంటలు ఏనుగుల సంచారంతో తీవ్రంగా దెబ్బతింటున్నాయి. రూ.కోట్లలో నష్టం సంభవిస్తున్నా... ఇందుకు సంబంధించిన పరిహారం నేటికీ అందించలేదు.

కుంకీ ఏనుగులు ఎక్కడ?

ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏనుగుల సమస్యను అధిగమించేందుకు తాము కట్టుబడి ఉన్నామని కూటమి నాయకులు బహిరంగ సభల్లో వెల్లడించారు. ప్రస్తుత డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నాడు కుంకీ ఏనుగులు తీసుకువస్తామన్నారు. వాటి సహాయంతో ఈ ప్రాంతాల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపులు తరలింపునకు చర్యలు చేపడతామన్నారు. నేటికీ ఆ దిశగా అడుగులు పడటం లేదు. పార్వతీపురం మండలం డోకిశిల పంచాయతీ జంతి కొండ వద్ద ఎలిఫ్యాంట్ జోన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేసినా అది కూడా కార్యరూపం దాల్చలేదు. దీంతో ప్రభుత్వ పెద్దల హామీలపై బాధితుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మరణ మృదంగం

గజరాజుల సంచారంతో గడిచిన కొద్ది సంవత్సరాల్లో 13 మంది మృత్యువాత పడ్డారు. 12 పశువులు మృతి చెందినట్టు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. వీటితో పాటు వ్యవసాయ బోర్లు, పంపు షెడ్లు, పరికరాలను, డ్రిప్ పైపులను నాశనం చేసాయి.

పరిహారం వద్దు.. శాశ్వత పరిష్కారం కావాలి...

ఇటీవల పాలకొండ నియోజకవర్గం భామిని మండలం ఘనసర వద్ద ఏనుగుల కారణంగా రైతులు నష్టపోయిన పంటలను అంచనా వేసేందుకు వచ్చిన అటవీ శాఖ అధికారుల వద్ద బాధిత రైతులు తీవ్రంగా స్పందించారు. తరచూ నష్టాల అంచనాలు నమోదు చేయడం తప్ప చేసేదీ ఏమీ లేదంటూ నినాదాలు చేసారు. తమకు పరిహారం వద్దని, శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను, ఎమ్మెల్యే జయకృష్ణను చుట్టుముట్టారు. బైఠాయించి నిరసన తెలిపారు.

రెండెకరాల్లో జొన్న పంట నాశనం



నా సొంత భూమితో పాటు మరో ఎకరా భూమిని కౌలుకు తీసుకుని రెండెకరాల్లో మొక్కజొన్న సేద్యం చేపట్టాను. అప్పులు చేసి మదుపులు పెట్టాను. కుటుంబమంతా కష్టపడ్డాం. కీలక దశలో ఏనుగుల గుంపు దాడి చేయటంతో పూర్తిగా పంట నష్టపోయాను. నష్టపోయిన పంటను చూసేందుకు పొలంకు వెళ్లాలన్నా భయం వేస్తుంది. ఏ క్షణం ఏనుగులు దాడి చేస్తాయోనని బిక్కుబిక్కుమంటున్నాం. నష్ట పరిహారాలు ఎందుకు? ఈ ప్రాంతం నుంచి వాటిని తరలిస్తే మేలు.

– వలరౌతు లక్ష్మీనారాయణ, రైతు, ఘనసర, భామిని మండలం

నిరంతరం నిఘా

ఏనుగుల కదలికలపై మా సిబ్బంది నిరంతరం దృష్టి సారిస్తున్నారు. అవి సంచరించే పరిసరాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. ఏనుగుల పునరావాస కేంద్రం ఏర్పాటుకు గుచ్చిమి వద్ద ఏర్పాట్లు చేపట్టనున్నాం. ఇందుకు సంబంధించి శాఖాపరమైన అనుమతులు వచ్చాయి. రూ.5 కోట్లతో సోలార్ కంచె, ట్రెంచులు, వెదురు వనాలు, నీటి సంపులు, ఇతర వసతులు ఏనుగుల కోసం సిద్ధం చేయాలని నిర్ణయించాం. తొలి దశలో రూ.కోటి నిధులతో పనులు చేపడతాం. పంట నష్టాలకు సంబంధించి దాదాపు మూడు వేల మంది రైతులకు రూ.45లక్షలు వరకు జమ చేశాం. రెండు మూడు రోజుల్లో సదరు రైతుల ఖాతాకు ఈ మొత్తాలు పూర్తిగా జమ కాబడతాయి. కుంకీ ఏనుగులను తీసుకువచ్చే విధంగా అడుగులు పడుతున్నాయి.

– జీపీఏ ప్రసూన, అటవీ శాఖాధికారిణి

ఏనుగులు మళ్లీ వచ్చేశాయ్...

జియ్యమ్మవలస: మండలంలోని జోగిరాజుపేట, బట్లబద్ర, కన్నపుదొరవలస, వెంకటరాజపురం పరిసర ప్రాంతాలలోకి గురువారం సాయంత్రం ఏనుగులు మళ్లీ వచ్చాయి. రాత్రి పూట పొలాలకు వెళ్లే రైతులు అప్రమత్తంగా ఉండాలని అటవీ సిబ్బంది సూచించారు. ప్రస్తుతం జోగిరాజు పేట వద్ద ఉన్నాయని, రాత్రి సమయానికి బిత్రపాడు, బాసంగి తదితర పంట పొలాలలోకి వచ్చే అవకాశముందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.



గుచ్చిమి వద్ద స్థల పరిశీలన చేస్తున్న జిల్లా అటవీ శాఖాధికారిణి ప్రసూన

'బడిదేవర' తవ్వకాల అనుమతులపై ఆగ్రహం



ఏపీఓ మురళీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బడిదేవర కొండ పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

- అనుమతులు రద్దు చేయకుంటే ఆందోళన ఉధృతం
- ఐటీడీఏ కార్యాలయం వద్ద ధర్నా

పార్వతీపురం టౌన్: బడిదేవర కొండ తవ్వకాలకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని కొండ పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు మూడడ్ల కృష్ణమూర్తి డిమాండ్ చేసారు. పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయం అడవితల్లి విగ్రహం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి దేవరమ్మ కొండ మైనింగ్ తవ్వకాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అన్ని రకాల అనుమతులు రద్దు చేయాలని, కొండ పరిసర ప్రాంత గిరిజనులకు న్యాయం చేయాలన్నారు. కొండపై గిరిజనులకు పోడు పట్టాలు ఇచ్చిన చోట మైనింగ్ తవ్వకాలకు ఎలా అనుమతి ఇస్తారని ఆగ్రహం వ్యక్తం చేసారు. కొండపై మైనింగ్‌కు ఇచ్చిన అన్ని రకాల అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేసారు. ఐటీడీఏ అధికారులు గిరిజనులకు రక్షణగా ఉండాలని కోరారు. తవ్వకాలకు కనీసం అభిప్రాయ సేకరణ కూడా చేపట్టలేదన్నారు. అక్కడి గిరిజనులు, రైతులు బడి దేవరమ్మ కొండను దేవతగా కొలుస్తారని పేర్కొన్నారు. అడ్డగోలుగా తవ్వకాలకు అనుమతులిచ్చి వ్యవసాయం, పర్యావరణం, గిరిజన బ్రతుకులు నాశనం చేస్తుంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. అనంతరం ఏపీఓ మురళీధర్, ఏఓ ప్రసాద్‌లకు వినతిపత్రం అందజేశారు. కొండ పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అఖిల భారత రైతు కూలీ సంఘం నేత బొత్స నర్సింగరావు, రైతు కూలీ సంఘం నాయకులు పి. శ్రీను నాయుడు, ఉయక ముత్యాలు, ఎం.భాస్కరావు గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్ కుమార్, అఖిల భారత గ్రామీణ వ్యవసాయ కార్మిక సంఘం పి.సంఘం, ఏపీ రైతు సంఘం నాయకులు బుడితి అప్పలనాయుడు, సీపీఐ నాయకులు తోట జీవన్, ప్రగతి శీల మహిళా సంఘం నాయకులు పోలా రమణి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గరుగుబిల్లి సూరయ్య, పాల మెట్ట రాము, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు నారాయణపురం రాజు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర అంతర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్

విశాఖ స్పోర్ట్స్:

రాష్ట్ర అంతర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో విశాఖ రీజియన్ జట్లు సత్తా చాటాయి. 13 రీజియన్లకు చెందిన పాలిటెక్నిక్ కళాశాలల జట్లు పోటీపడగా చిత్తూరు, కృష్ణా రీజియన్ జట్లు ప్రతిభ కనబరిచి చాంపియన్‌షిప్‌కు పోటీపడ్డాయి. బాలికల వాలీబాల్ పోటీలో విశాఖ టెక్నాలజీ ఇనిస్టిట్యూట్(విశాఖ) విజేతగా నిలవగా బాలాజీ పాలిటెక్నిక్(గజపతినగరం) రన్నరప్ సాధించింది. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్(విశాఖ) కళాశాలలో మూడు రోజుల పాటు జరిగిన పోటీలు గురువారంతో ముగిశాయి. బహుమతి కార్యక్రమానికి వీపీటీ ప్రిన్సిపాల్, మీట్ కన్వీనర్ కె.నారాయణరావు అధ్యక్షత వహించి మాట్లాడారు. ఆటల్లో గెలుపోటములను స్వీకరిస్తూనే నేర్చుకోవాలని హితబోధ చేశారు. ఆటలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. సాంకేతిక విద్యా శాఖ కాకినాడ ఆర్జేడీ జె.సత్యనారాయణ, తిరుపతి ఆర్జేడీ నిర్మల్‌కుమార్ ప్రియా, డిప్యూటీ డైరెక్టర్ విజయభాస్కర్, మీట్ కో కన్వీనర్ బి.జానకిరామయ్య, జీవిసీఈ ప్రిన్సిపాల్ కేవీ రమణ పాల్గొన్నారు. పీడీలు అబ్బాస్, కమాల్, వెంకటేశ్వరరావు పర్యవేక్షించగా సాంకేతికవిద్య శాఖ ఉన్నతాధికారులు, సిబ్బంది హాజరయ్యారు.

నిన్న బాధ్యతలు.. నేడు పదవీ విరమణ



అదనపు ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన నాగేశ్వరి

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లా అదనపు ఎస్పీగా ఎల్.నాగేశ్వరి గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు అదనపు ఎస్పీగా ఉన్న డాక్టర్ ఓ.దిలీప్‌కిరణ్‌కి ఏసీబీ, విజయవాడ బదిలీ అయ్యింది. 1989 సంవత్సరంలో ఎస్ఐగా కమ్మంలో బాధ్యతలు చేపట్టిన ఎల్.నాగేశ్వరి 36 సంవత్సరాలుగా విధి నిర్వహణలో పదోన్నతులు పొందుతూ 3 నెలల క్రితం అదనపు ఎస్పీగా పదోన్నతి పొందారు. తన సర్వీసులో తొలిసారి అదనపు ఎస్పీగా జిల్లాలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. అయితే పదవీ విరమణ సమయం జనవరి 31తో పూర్తి కావడంతో ఆమె పదవీ విరమణ పొందనున్నారు. జిల్లాలో రెండు రోజులు అదనపు ఎస్పీగా విధులు నిర్వహించిన వారిగా ఆమె నిలిచారు.

ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర కీలకం



కేజీబీవీ ప్రిన్సిపాళ్ల నుంచి వివరాలు తెలుసుకుంటున్న కేజీబీవీ రాష్ట్ర సెక్రటరీ డి.దేవానందరెడ్డి

- కేజీబీవీ సెక్రటరీ డి.దేవానందరెడ్డి
- ఉత్తమ ఫలితాల కోసం పంచతంత్ర ప్రణాళికపై సమీక్ష

విజయనగరం అర్బన్: కేజీబీవీల్లో బాలికలకు విద్యాబోధనలు అందించడంతో పాటు వాళ్ల మానసిక వికాసాన్ని పెంపొందించడానికి ప్రిన్సిపాళ్లు, బోధన సిబ్బంది తల్లిదండ్రుల తమ వంతు పాత్ర బాధ్యతగా నిర్వహించాలని కేజీబీవీ స్టేట్ సెక్రటరీ డి.దేవానందరెడ్డి అన్నారు. కేజీబీవీ నిర్వహణపై ప్రిన్సిపాళ్లతో స్థానిక కేజీబీవీలో గురువారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. పది, ఇంటర్ వార్షిక పరీక్షల ఉత్తమ ఫలితాల కోసం చేపట్టిన పంచతంత్ర ప్రణాళిక పనితీరును తొలిత కేజీబీవీల వారీగా ప్రిన్సిపాళ్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెసిడెన్షియల్‌గా నిర్వహిస్తున్నందున బాలికల అన్ని విధాల అభివృద్ధి బాధ్యత తీసుకోవాలని సూచించారు.

ఆరో తరగతి నుంచి బేసిక్స్ బోధనలు అందించడంలో శ్రద్ధ తీసుకుంటే పది, ఇంటర్ వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధ్యం సులువవుతాయని అన్నారు. కేజీబీవీల పరిసరాల పరిశుభ్రంతో పాటు ఆహార పదార్థాల నాణ్యత పాటించాలని ఆదేశించారు.

యూనివర్సిటీ కిక్ బాక్సింగ్ పురుషుల జట్టుకు ఎంపిక



కిక్ బాక్సింగ్ పురుషుల జట్టు సభ్యులతో కళాశాల డైరెక్టర్ డాక్టర్ శశిభూషణరావు

విజయనగరం అర్బన్: పంజాబ్ గురుకాశీ యూనివర్సిటీలో వచ్చే నెల 11 నుంచి 18వ తేదీ వరకు జరిగే అఖిల భారత అంతర్ యూనివర్సిటీ విద్యాలయ కిక్ బాక్సింగ్ పురుషుల జట్టు పోటీలలో పాల్గొనే జేఎన్‌టీయూ విజయనగరం గురజాడ (జీవీ) యూనివర్సిటీ జట్టులో సీతం ఇంజినీరింగ్ కళాశాల క్రీడాకారులు ఏడుగురు ఎంపికయ్యారు. ఈ మేరకు గురువారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీరామమూర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల జేఎన్‌టీయూ జీవీలో నిర్వహించిన అంతర్ కళాశాలల పోటీలలో కళాశాల క్రీడాకారులు ప్రతిభ చూపారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, కళాశాల అధ్యాపకులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వీరఘట్టం: మండలంలోని సీఎస్పీ రహదారిలో నడిమికెల్ల-కడకెల్ల గ్రామాల మధ్య గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జి.శంకరరావు అనే వ్యక్తికి కాళ్లు, తలపై తీవ్ర గాయాలయ్యాయి. ఈయన గరుగుబిల్లి మండలం నవిరి గ్రామం నుండి బైక్‌పై పాలకొండ వైపు వెళుతుండగా వెనుక నుండి బైక్ వచ్చిన ఓ వ్యక్తి శంకరరావు నడుపుతున్న బైక్‌ను ప్రమాదవశాత్తు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. క్షతగాత్రుడు శంకరరావును 108 వాహనంలో పార్వతీపురం తరలించారు. ప్రమాదానికి కారణమైన వ్యక్తి బైక్‌ను వదిలేసి పరారయ్యాడు. ప్రమాద స్థలంలో ఉన్న రెండు బైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రమాదానికి సంబంధించి ఎవరూ ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు.

హాస్య కథల పోటీలకు ఎంట్రీల ఆహ్వానం

విజయనగరం అర్బన్: హాస్యల కథల పోటీలకు రచయితల నుంచి ఎంట్రీలను పట్టణానికి చెందిన అభినందన సేవా సంస్థ ఆహ్వానిస్తోంది. ఈ మేరకు పోటీల నియమ నిబంధనలను ఆ సంస్థ కార్యదర్శి వి.నాగేశ్వరరావు గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

పోటీల ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు రూ.2,500, రూ.2 వేలు, రూ.1.500లు నగదు బహుమతులు ప్రకటించారు. మరో మూడు కథలకు రూ.500 వంతున కన్సొలేషన్ బహుమతులు ఇవ్వనున్నారు. కథలు రెండు పేజీలకు మించరాదు. చేతిరాతతో కానీ, టైపు చేసినవైనా కానీ పోస్టు ద్వారానే పంపాల్సి ఉంటుంది. కథ ఇంతకు ముందు ఎక్కడా ప్రచురితం కాలేదని, ఎందులోనూ పరిశీలనలో లేదని తెలియజేస్తూ రచయిత హామీ పత్రాన్ని విధిగా కథతో జత చేయాలి. కథలు పంపాల్సిన చిరునామా 'డాక్టర్ సి.రామలక్ష్మి, 60-12-6, జీ-3, బ్యాంక్ కాలనీ-2, మొగల్‌రాజాపురం, విజయవాడ-520010, ఫోన్:6302738678'కు పంపాలని పేర్కొన్నారు.

కొఠియా పల్లెల్లో ఒడిశా పోలీసుల జులుం

- భయాందోళనలు చెందుతున్న ఆంధ్రా అధికారులు, సిబ్బంది
- చోద్యం చూస్తున్న కూటమి ప్రభుత్వం

సాలూరు:

ఆంధ్రా – ఒడిశా వివాదాస్పద కొఠియా గ్రూపు గ్రామాల్లో ఒడిశా పోలీసులు జులం ప్రదర్శిస్తున్నారు. అడపాదడపా వివాదాలు తరువాత చాలా కాలం స్తబ్దుగా ఉన్న ఒడిశా యంత్రాంగం రాష్ట్రంలో ఇటీవల కూటమి ప్రభుత్వం ఏర్పాడ్డాక మళ్లీ తనదైన శైలిలో పాత బాణీని ప్రదర్శిస్తోంది. ఇటీవల జరిగిన ఓ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే... మండలంలోని కొఠియా గ్రూపు గ్రామాల్లో ఒకటైన గంజాయిభద్ర పంచాయతీలో దిగువశెంబిలో అంగన్‌వాడీ కేంద్రంలో తెలుగులో ఉన్న చార్ట్‌లు, బోర్డులను ఒడిశా పోలీసులు తీసుకువెళ్లిపోయారు. ఈ నెల 27న సోమవారం సాయంత్రం 6 గంటల సమయంలో సుమారు పది మంది ఒడిశా పోలీసులు అప్పటికే మూసి వేసిన అంగన్‌వాడీ కేంద్రం వద్దకు వచ్చారు. తెలుగులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం బోర్డును బయట ఉంచరాదని, కేంద్రంలో దాచుకోవాలని చెప్పి కొంత దూరం వెళ్లారు. మళ్లీ ఏమైందో తెలియదుగాని మళ్లీ గ్రామంలోకి వచ్చి బలవంతంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని తెరిపించారు. తెలుగులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం బోర్డును, కేంద్రంలో తెలుగులో రాసి ఉన్న చార్ట్‌లు తదితర సామగ్రిని తీసుకువెళ్లిపోయారు. ఇవి కావాలంటే కొఠియా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తీసుకువెళ్లాలని చెప్పారు. ఈ క్రమంలో ఆంధ్రా తరఫున అంగన్‌వాడీ కేంద్రం నడపడానికి ఇల్లు ఎందుకు ఇచ్చారని పోలీసులు ఒడియా భాషలో ఇంటి యజమానికి ప్రశ్నించారు. జరిగిన విషయాన్ని అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మి, సూపర్‌వైజర్లు, సీడీపీఓ విజయలక్ష్మికి చెప్పగా బుధవారం గ్రామానికి అంగన్‌వాడీ అధికారులు వెళ్లి విచారణ జరిపారు. విచారణ నివేదికను ఐసీడీఎస్ పీడీ కార్యాలయ అధికారులకు గురువారం అందజేసారు.



ఒడిశా పోలిసులు బోర్డులు, చార్టులు తీసుకువెళ్లిన నేపథ్యంలో దిగువశెంబిలో విచారణ చేస్తున్న అంగన్‌వాడీ అధికారులు

చోద్యం చూస్తున్న కూటమి ప్రభుత్వం

ఈ సంఘటన జరిగిన నేపథ్యంలో కొఠియా గ్రూపు గ్రామాల్లో పని చేసేందుకు ఆంధ్రా అధికారులు, సిబ్బంది భయపడుతున్నారు. తరచూ ఒడిశా పోలీసులు అక్కడ విధి నిర్వహణకు వెళ్లే ఆంధ్రా అధికారులు, సిబ్బందిని అడ్డుకోవడం వంటి పరిస్థితుల్లో ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతాల్లో స్టేటస్ కో అమల్లో ఉన్నప్పటికీ ఒడిశా పోలీసులు జులం ప్రదర్శిస్తున్న నేపథ్యంలో కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుందని స్థానిక గిరిజనులు, నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటు రాష్ట్రంలో బీజేపీతో కూడిన కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడం, అటు ఒడిశాలో బీజేపీ ప్రభుత్వమే కొలువుదీరిన నేపథ్యంలో దశాబ్దాల ఈ వివాదాన్ని పరిష్కరించేందుకు ఆంధ్రా కూటమి నేతలు ఏ మేరకు చిత్తశుద్ధితో అడుగులు ముందుకు వస్తారో వేచి చూడాల్సి ఉంది. కొఠియా గ్రూపు గ్రామాల వివాదమున్న ఈ సాలూరు నియోజకవర్గానికి రాష్ట్ర స్త్రీశిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ప్రాతినిధ్యం వహించడం విశేషం. ఈ వివాదానికి ఎలా ఫుల్‌స్టాప్ పెడతారో వేచి చూడాలి.

మరియగిరి.. భక్త సిరి

- మరియమ్మను దర్శించుకున్న భక్తజనం
- దివ్యపూజలు చేసిన శ్రీకాకుళం మేత్రాసనం పీఠాదిపతి విజయకుమార్

వీరఘట్టం: శ్రీకాకుళం మేత్రాసన పాలక పునీతురాలు, క్రైస్తవుల సహాయమాత మరియమాత జాతర గురువారం వైభవంగా సాగింది. వీరఘట్టం సమీపంలోని యు.వెంకమ్మపేట వద్ద మరియగిరి కొండపై వెలసిన మరియమ్మకు శ్రీకాకుళం మేత్రాసనం పీఠాదిపతి రాయరాల విజయకుమార్ సమక్షంలో భక్తులు ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. మేరీమాత స్తోత్రం వినిపించారు. ఓ తల్లీ మరియా ... మమ్మల్ని కాపాడమ్మా అంటూ ప్రార్థించారు. ఉత్తరాంధ్ర జిల్లాలు, ఒడిశా రాష్ట్రం నుంచి సుమారు 40వేల మంది భక్తులు దివ్యపూజలో పాల్గొన్నారు. కులమతాలకు అతీతంగా కొండపైకి నడుచుకుంటూ వెళ్లి మేరిమాతను దర్శించుకొని మొక్కులు చెల్లించారు. కొత్తగా ఏర్పాటుచేసిన మేరీమాత విగ్రహాన్ని శ్రీకాకుళం బిషప్ విజయ్‌కుమార్, నెల్లూరు బిషప్ ఆంథోనిరాజ్ ఆవిష్కరించారు. వీరఘట్టం, చిట్టపుడివలస, సివిని, పార్వతీపురం, బెలగాం, గరుగుబిల్లి, తూడి, పాలకొండ, వంగర, తలవరం, సంకిలి, నవగాం, పాలవలస గురుమండలాల్లో ఇటీవల నిర్వహించిన బైబిల్ పోటీలు, ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.